# ౭ వేంకటేశ్వర దీపారాధన

ఉరిశిక్ష (capital punishment) ఇవ్వవచ్చునా ఇవ్వకూడదా అనే సమస్యలో లోకం ఇప్పుడు పడిందికాని, మా యింట్లో హేంగింగు లైటుకు హేంగింగు తీసిపాఉవేసేసి చాలాకాలమైంది. ఆ లైటు — దానికేదోవచ్చి పాడై పోతే అటకమీద పడవేశాం. అటకే దానికి బంకోలు.

మనిషికేమిటి వస్తువుకేమిటి, చూడండీ! కొన్నాళ్ళకు కర్మపరిపక్వమైతే, తిరిగి యథాస్థానం అలంకరిస్తుంది. ఆ ప్రకారంగా మాలైటుకు మళ్ళీ మంచిరోజులు వచ్చినయి కామోసు, దాన్ని పైకితీసి, జ్వాల — జుంకా తుడిచి సరిచేసి సరంబికి వ్రేళ్ళాడదీద్దామని తలపోసి, వ్రేళ్ళాడదీస్తే కాపిటల్ పనిష్మెంటు అయిపోతుందేమో అని ఆలాగ్గానే దాని మొత్త బొట్టమోపుగా ఓ కన్నాల స్టాండుమీద, కిందనుంచీ పైనుంచీ గాలోసుకొనేలాగు నిలబెట్టి, టేబిల్మీద పెట్టుకుని పనిచూచుకుంటూ వున్నాను.

పనంటే ఏమీలేదు. నాకొచ్చిన love letters (ప్రణయ లేఖలు') అన్నీ అక్కడదిక్కడ పెట్టీ ఇక్కడదక్కడ పెట్టీ లైటు హెచ్చించి వెల్తురులో ఎలా కనబడతాయో అని వొక మాటూ, లైటుతగ్గించి చీకట్లో ఎలా కనబడుతాయో అని వొకమాటూ, ఎక్స్పెరిమెంటు చేస్తూవున్నాను.

లెటర్సు పాతవైనా ఎక్స్‌పెరిమెంటు కొత్తదికావచ్చు. ఎక్స్‌పెరిమెంటు కూడా వొక్కొక్కప్పుడు పాతదైనా ఈ పర్యాయం వచ్చే రిసల్టు కొత్తది కావచ్చు. ఏమంటారు ?

గబుక్కున నాచెయ్యి ఆ టేబిల్‌మీదవున్న బొట్టమోపు మొత్తానుడు హేంగింగులైటుకు ఎలా తగిలిందో తగిలింది. మంచి రసకంధాయపట్టు ఏదో చదువుతున్నాకామోసు — "ఓ ! ప్రియుడా ! నిన్ను బాసియుండడమంటే బహుకష్టంగా వుంది. నీ బాహుపంజరంలోకి అమాంతంగా దుమికేసెయ్యాలనివుంది. కాని నాపాద మంజీరం ధ్వని చేస్తుందేమోనని భయమేస్తూవుంది. ఓ ! నా మోసగాడా ! నీ కళ్ళల్లో నా కళ్ళు పెట్టి చూడాలనివుంది. కాని మన కనుపాపల్లో నీడలు అమాంతంగా పరస్పరం గావులించుకొని మనలను గ్రుడ్డివాళ్ళనుగా చేస్తాయేమోనని సంకోచంగా వుంది. ఓ ! సింహోరస్తుడా ; నీ హృదయంలోకి, నీ వక్షాని కపాయం లేకుండా నాకు చొరుచుకు పోవాలనివుంది. కాని వెనకాలనుంచా ముందునుంచా అనే మీమాంస ఎంతకీ తెగడంలేదు — " అని అలాగ్గా అంత ఇదిగావున్న ఒకానొక ప్రణయలేఖ చదువుతూ వున్నానేమో బహూ మూవ్ చేసింది. పూర్వోక్తప్రకారంగా నాచెయి తగిలింది. దేనికీ ? ఆ బొట్టమోపు మొత్తానుడు, వెలుగుతూవున్న హేంగింగులైటుకు.

తగిలిన పాళంగా టేబిల్‌మీదవున్న లైటు, టేబిల్‌మీదనే అమాంతంగా బోల్తాకొట్టి చమురుకక్కి జ్వాలాతోరణంలా అయిపోయింది. చిమ్నీ ఊడిపడింది. జ్వాలేఆపడమో చిమ్నీనే కాపాడ్డమో రెండూ తెలియక — "రా ! రా ! తగులడిపోయినాయి ఇవన్నీని ఈ ప్రణయ లేఖలన్నీని" అన్నాను, అప్రయత్నంగా. అంటూనేవున్నాను ! గది అంతా చీకటిమయం అయిపోయింది. ఆ చీకట్లో గుడ్డిదీపం పుచ్చుకొని,

అంటే బుడ్డిదీపం అన్నమాట అదే బ్రెడ్రూములైటు, అదుచ్చుకొని తయారైంది మా యావిడ తాయారమ్మగారు.

"ఏమిటి గొడ" వంటుంది. "ఏముంది ? నివ్వూనేనూ యీ యావత్తు ప్రపంచం పరశురామప్రీతి అయి యుండిపోవలసింది. ఓ గడియ క్రిందట" అన్నాను. "మఱి కాలేదేం ?" అంది కామ్‌గా ఆ వ్యక్తి. "కాలేదు. నీపుణ్యవశాత్ కాలేదు." అని అక్కణ్ణుంచి వేదాంతంలో పడ్డాను, ఆవిడతోటి ప్రసంగిస్తూ. "చూడూ : ఇలాంటివేనేవ్ మహా ప్రళయాలు అన్నా మహాప్రళయాలు దాటుకుపోవడమన్నాను :—నిజంగా నీవు చూశ్లేదుగాని మన హేంగింగులైటు ఇప్పుడు గుప్పుమనడం, బ్రహ్మాండంగా మండిపోయింది ఈ టేబిల్‌మీద—ఈ కాయితాలన్నీ నుసి అయిపోయినాయే అనుకొన్నాను. కాని దేవుని అపారమైన కృపవల్ల కాలేదు, ఏదీ ? వొక్క దివ్యోపాసన కానియ్యి, ఆ పరాత్పరుడికి మన కృతజ్ఞత తెలపాలి" అన్నాను.

అనేసరికి తారాజువ్వలాగు లేచింది. ఆ బుడ్డిదీపం అక్కడ పెట్టింది. మళ్ళీ తీశేరూ ఆ చెత్తకాగితాలు : మీ ప్రణయలేఖలు : ఇలాయివ్వండి, అవి ఇలా యివ్వండి అని—"ఇవి మీదగ్గఱున్నన్నాళ్ళూ దీపాలు పడగొడతారు, దెయ్యాల్ని విడగొడతారు; ఇలాయివ్వండీ : ఇమ్మనమంటే ? ఇప్పటికైనా ఇవ్వరేం ?" అని నా చేతుల్లో నున్న లేఖలన్నీ ఊళ్ళాక్కుని ఇంతింత ముక్కలుగా చించి గిరాటేసింది. వీధిలోకి విసిరేసింది.

ఎవరైనా తెల్లాఱి అంటించి చదువుతారేమో ?" అన్నాను. అనేసరికి తానే స్వయంగా అవతలకువెళ్ళి బుడ్డెడు చమురూ ఆ చించిన

ముక్కలమీద పోసి అగ్గిపుల్లట్టుకొచ్చి అంటించి, జ్వాలచేసి "ఇక నిదరోండి!" అంది.

చెప్పొద్దూ ! నా హృదయం మహావేదన పడిపోయింది. అలా ఆ నా ప్రణయలేఖలు తగులడిపోతూవుంటే కాని ఓవిజయం! ఏతాయిలంగారు ఆ లేఖలు వ్రాసినారో, నా తాయారమ్మకు తెలియకుండా అవి తగులడి పోవడమే నాక్కావలసిందల్లా !

ఆ ముక్కనేసరికి మొగమ్ముణిచిపెట్టుకొని — నా తాయారమ్మ మొగమ్ముణిచి పెట్టుకొని—"లోకమా ! నవ్వు ! లోకమా ! ఏడువు ! లోకమా ! చావు!" అని వొకటే విజృంభణ, క్షణక్షణ.... ....

ఆవిజృంభణ ఎప్పుడు ఆగింది? వేంకటేశ్వర దీపారాధన మొక్కలోలో నేను మొక్కుకుని, అసలు తాయారమ్మకు మొక్కి, వడ్డీతాయారమ్మకు మొక్కితేనేగాని ఆగలే !

---

| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
|---|---|---|
| 10—11—1936 | రాజమంత్రి | "వినోదిని"లో |